RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 414 | 03 శుక్రవారం జూలై 2026. | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

## చర్చకు పిలిచి మొహం చాటేశారు

: మంత్రి జూపల్లిపై హరీశ్ రావు ఫైర్



తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య రాజకీయ పోరు తీవ్రరూపం దాల్చింది. గురుకుల పాఠశాలల టెండర్లు, రాష్ట్ర అప్పులపై బహిరంగ చర్చకు రావాలంటూ సవాల్ విసిరిన మంత్రి జూపల్లి కృష్ణారావు, తీరా సమయం వచ్చేసరికి వెనకడుగు వేశారని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం చర్చ కోసం తాము తెలంగాణ భవన్‌కు చేరుకున్నా, మంత్రి రాకపోవడంపై ఆయన మండిపడ్డారు.గురువారం హరీశ్ రావు, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలు తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అదే సమయంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ గన్ పార్క్ వద్ద ఉన్నారన్న సమాచారంతో వారు అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య స్వల్ప తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది.

"చర్చకు రమ్మని సవాల్ విసిరింది వాళ్లే, తీరా మేము వస్తే పోలీసులను ప్రయోగించి అడ్డుకోవడం చూస్తుంటే, టెండర్లలో జరిగిన అవినీతి బయటపడుతుందనే భయంతోనే వారు పారిపోయారని స్పష్టమవుతోంది" అని హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్ర అప్పు రూ. 8 లక్షల కోట్ల నుంచి రూ. 7 లక్షల కోట్లకు ఎలా తగ్గిందో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

మరోవైపు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు కోసం ఖాళీ కుర్చీ వేసి వేచి చూశారు. పోలీసుల చర్యను ఆయన తీవ్రంగా ఖండించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అప్పులపాలైందని, భారీ స్థాయిలో అవినీతి జరిగిందని కాంగ్రెస్ మంత్రులు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఇరు పార్టీల నేతలు బహిరంగ చర్చకు సవాళ్లు విసురుకున్నారు.

## వాళ్ల డ్రామా చూస్తుంటే బిగ్ బాస్ షో చూస్తున్నట్టుంది

: బండి సంజయ్



తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. గురుకుల టెండర్లలో అవకతవకలు, రాష్ట్ర అప్పుల అంశంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య చోటుచేసుకున్న సవాళ్లు, ప్రతిసవాళ్లు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. బహిరంగ చర్చకు సిద్ధమంటూ కాంగ్రెస్ విసిరిన సవాల్‌ను స్వీకరించి గన్ పార్క్ వైపు బయలుదేరిన బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకోవడంతో హైడ్రామా నెలకొంది. ఈ పరిణామాలపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కుమార్ ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య జరుగుతున్న వ్యవహారం 'బిగ్ బాస్' షోను తలపిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. పైకి పోరాటంలా కనిపిస్తున్నా, లోపల ఆ రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయని సోషల్ మీడియా వేదికగా విమర్శించారు. ఈ రెండు పార్టీల అవినీతి, రాష్ట్ర అప్పులు, పాలనా వైఫల్యాలపై బహిరంగ చర్చ ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకు సూచించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో తెలంగాణకు కేంద్రం అందిస్తున్న సహకారాన్ని కూడా ప్రజలకు వివరిద్దామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు 'డబుల్ ఎలిమినేషన్' తప్పదని, రాష్ట్రంలో 'డబుల్ ఇంజిన్' సర్కార్ రావడం ఖాయమని బండి సంజయ్ జోస్యం చెప్పారు.

# సవాల్ చేసి వెనక్కి తగ్గారు..

## చర్చకు దమ్ముంటే అసెంబ్లీ పెట్టండి: కేటీఆర్

- చర్చకు సవాల్ చేసిన కాంగ్రెస్ నేతలే వెనక్కి తగ్గారని కేటీఆర్ విమర్శ
- హరీశ్‌రావు అరెస్టును ఖండిస్తూ వెంటనే విడుదల చేయాలని డిమాండ్
- అప్పులు, గురుకులాల అంశంపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్
- తన లెక్కలు తప్పని నిరూపిస్తే రాజీనామా చేస్తానన్న మంత్రి జూపల్లి



రాష్ట్ర అప్పులు, గురుకులాల్లో అవినీతిపై చర్చకు తాము సిద్ధమని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పునరుద్ఘాటించారు. కానీ సవాల్ చేసిన కాంగ్రెస్ మంత్రులే ఇప్పుడు వెనక్కి తగ్గారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన సీఎం రేవంత్‌రెడ్డి మొదట చర్చకు సవాల్ విసిరారని తెలిపారు. తాము అంగీకరించాక మాట మార్చారని విమర్శించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు తెలంగాణ భవన్‌కు వస్తానని చెప్పి చివరకు గన్‌పార్క్‌కు వెళ్లడం ఎందుకని ప్రశ్నించారు. సవాళ్లు విసిరే ముందు వాటిని నిలబెట్టుకునే ధైర్యం ఉండాలని అన్నారు.గన్‌పార్క్‌కు వెళుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడాన్ని కేటీఆర్ ఖండించారు. ప్రభుత్వానికి ఏ అంశంపైనా బహిరంగ చర్చ చేపట్టే ధైర్యం లేదని ఆరోపించారు. హరీశ్‌రావు సహా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజల ముందే అన్ని వాస్తవాలు చెప్పాలని భావించినా ప్రభుత్వం అడ్డుకుందని విమర్శించారు.

రాష్ట్ర అప్పులు, గురుకులాల్లో అవినీతిపై చర్చించేందుకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. స్పీకర్ ఎలాంటి ఆంక్షలు లేకుండా పూర్తి స్థాయిలో చర్చకు అవకాశం కల్పించాలని కోరారు. మరోవైపు గన్‌పార్క్ వద్ద మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తన సవాల్ కేటీఆర్, హరీశ్‌రావులకు కాదని తెలిపారు.


నేరుగా కేసీఆర్‌కేనని స్పష్టం చేశారు. తాను చెప్పిన అప్పుల లెక్కలు తప్పని నిరూపిస్తే మంత్రి పదవితో పాటు ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తానని ప్రకటించారు.

## నీట్ రీ-ఎగ్జామ్ ఫలితాలపై ఎన్‌టీఏ కీలక అప్‌డేట్



నీట్-యూజీ రీ-ఎగ్జామ్ ఫలితాలను జులై 20లోపు ప్రకటిస్తామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వెల్లడించింది. ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణలతో మే 3న నిర్వహించిన పరీక్షను రద్దు చేసిన తర్వాత జూన్ 21న మళ్లీ పరీక్ష నిర్వహించారు. ఫలితాల విడుదల కోసం వేగంగా ప్రక్రియ కొనసాగుతోందని ఎన్‌టీఏ సీనియర్ అధికారి తెలిపారు. అయితే ఫలితాల కచ్చితమైన తేదీని ఇప్పుడే వెల్లడించలేదు. ఎంబీబీఎస్ విద్యా సంవత్సరం ఆలస్యం కాదని మాత్రం స్పష్టం చేశారు.జూన్ 25న ప్రొవిజనల్ ఆన్సర్ కీ విడుదల చేయగా, అభ్యర్థులకు జూన్ 28 వరకు అభ్యంతరాలు తెలిపే అవకాశం ఇచ్చారు. మొత్తం సుమారు 10 వేల అభ్యంతరాలు వచ్చినట్లు ఎన్‌టీఏ తెలిపింది. ఒక్కో అభ్యంతరాన్ని విడివిడిగా పరిశీలించి, సమర్పించిన ఆధారాలను పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. ఒక్కో ప్రశ్నకు రూ.200 ఫీజు వసూలు చేస్తారని, అభ్యంతరం సరైందని తేలితే ఆ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని వెల్లడించారు.ఫలితాల అనంతరం 15 శాతం ఆల్ ఇండియా కోటా, ఎయిమ్స్, జిప్‌మర్, కేంద్ర, డీమ్డ్ యూనివర్సిటీల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) విడుదల చేయనుంది. రాష్ట్రాలు తమ 85 శాతం స్టేట్ కోటా కౌన్సెలింగ్‌ను విడిగా నిర్వహిస్తాయి. కౌన్సెలింగ్ పూర్తయిన వెంటనే గత ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ఎంబీబీఎస్ తొలి సంవత్సరం విద్యా తరగతులు సమయానికే ప్రారంభమవుతాయని ఎన్‌టీఏ అధికారులు తెలిపారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గురువారం సాయంత్రం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. తిరుపతి జిల్లాలో జరిగిన అధికారిక పర్యటనను ముగించుకున్న అనంతరం ఆయన తిరుమలకు చేరుకుని మొక్కులు చెల్లించుకుని, శ్రీవారి సేవలో పాల్గొన్నారు. అంతకుముందు, తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ముక్కవారిపల్లెలో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ గ్రామీణ్' (వీబీ-జీ-రామ్-జీ) పథకం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు హాజరైన ఈ కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రారంభమైంది.ప్రభుత్వ కార్యక్రమం ముగిసిన తర్వాత తిరుమలకు చేరుకున్న పవన్ కల్యాణ్‌కు ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను, చిత్రపటాన్ని ఆయనకు బహూకరించారు.తిరుమల పర్యటనలో పవన్ వెంట తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కల్యాణం శివ శ్రీనివాస, హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి కమిషనర్ కృష్ణ తేజ తదితరులు ఉన్నారు.

## రెండు, మూడు నెలల్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం: కేంద్రమంత్రి



వాహనదారులకు ఊరటనిచ్చేలా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి కీలక సంకేతాలిచ్చారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ప్రస్తుత స్థాయిలోనే స్థిరంగా కొనసాగితే, రాబోయే రెండు, మూడు నెలల్లో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం ఉందని ఆయన గురువారం వెల్లడించారు.పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ముడిచమురు ధరలు గరిష్ఠంగా ఉన్న సమయంలో కొనుగోలు చేసిన నిల్వలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రస్తుతం వినియోగిస్తున్నాయని మంత్రి వివరించారు. దీనివల్ల జూన్ 30 నాటికి ప్రభుత్వ రంగ చమురు సంస్థలు పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ విక్రయాలపై సుమారు రూ. 74,781 కోట్ల మేర నష్టాలను చవిచూశాయని పేర్కొన్నారు. ధరల తగ్గింపుపై ఇప్పుడే వ్యాఖ్యానించడం తొందరపాటే అవుతుందని, అదంతా ముడిచమురు ధరల స్థిరత్వంపైనే ఆధారపడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారుఇదిలావుండగా, ప్రైవేట్ రంగ ఇంధన రిటైలర్ 'నయారా ఎనర్జీ' జూలై 1 నుంచి తన అవుట్‌లెట్లలో లీటరు పెట్రోల్‌పై రూ. 5, డీజిల్‌పై రూ. 3 చొప్పున తగ్గించింది. గత రెండేళ్ల కాలంలో చమురు ధరలు తగ్గడం ఇదే తొలిసారి. అలాగే, వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల ధరలను సైతం రూ. 183.50 మేర తగ్గించగా, గృహ వినియోగ సిలిండర్ల ధరల్లో మాత్రం ఎటువంటి మార్పు లేదు.గత నాలుగేళ్లలో భారత్‌లో పెట్రోల్ ధరలు కేవలం 5.58 శాతం, డీజిల్ ధరలు 6.23 శాతం మేర మాత్రమే పెరిగాయని, అదే సమయంలో అభివృద్ధి చెందిన దేశాల్లో 20 శాతం, పొరుగు దేశాల్లో 35 శాతం వరకు పెరిగాయని మంత్రి గుర్తు చేశారు. అంతర్జాతీయంగా తీవ్ర ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకం తగ్గించి ప్రజలపై భారం పడకుండా చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 102.12, డీజిల్ ధర రూ. 95.20 వద్ద స్థిరంగా కొనసాగుతోంది.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు 35% సబ్సిడీ

## మహిళల ఆర్థిక స్వావలంబనకు సెర్ప్ చేయూత..

## మండలంలో 75 యూనిట్ల స్థాపన లక్ష్యం

గీసుగొండ, జులై 2 హైదరాబాద్ ఎస్టేట్:
గ్రామీణ మహిళలు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించి స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని, ప్రభుత్వం కల్పిస్తున్న 35 శాతం సబ్సిడీ, బ్యాంకు రుణాలు, నైపుణ్య శిక్షణ, మార్కెటింగ్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఓ నాగ పద్మజ పిలుపునిచ్చారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో ప్రగతి మండల సమాఖ్య కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రాధిక అధ్యక్షతన నిర్వహించిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆహార అనుబంధ పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం 35 శాతం సబ్సిడీ అందిస్తోందని తెలిపారు. యూనిట్లు ఏర్పాటు చేయదలచిన వారికి డీపీఆర్ తయారీ, ఉద్యమ్ ఆధార్ నమోదు, ఫుడ్ సేఫ్టీ ధ్రువపత్రాలు, ట్రేడ్ లైసెన్స్, బ్యాంకు రుణాల అనుసంధానం, నైపుణ్య శిక్షణ, మార్కెటింగ్ సౌకర్యాలు తదితర సేవలను ప్రాజెక్టు ద్వారా అందిస్తున్నట్లు వివరించారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్థిరమైన ఆదాయ వనరులు ఏర్పరచుకోవాలని సూచించారు. యూనియన్ బ్యాంక్ ఆర్డీవో అశోక్ మాట్లాడుతూ, రుణాల మంజూరులో సిబిల్ స్కోర్ కీలకమని





పేర్కొన్నారు. రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా సిబిల్ స్కోర్‌ను మెరుగ్గా కొనసాగించవచ్చని, ఓవర్‌డ్యూ, ఎన్‌పీఏ ఖాతాలు ఉన్నవారికి రుణాల మంజూరులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మండల ప్రాజెక్టు మేనేజర్ ముక్కెర ఈశ్వర్ మాట్లాడుతూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మండలంలో 75 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన లక్ష్యంగా కార్యాచరణ కొనసాగుతోందన్నారు. ప్రతి గ్రామ సంఘం, ప్రతి క్లస్టర్ నుంచి అర్హులైన మహిళలను గుర్తించి యూనిట్ల స్థాపనకు ప్రోత్సహించాలని సూచించారు. సబ్సిడీ రుణాల కోసం ఎలాంటి రుసుములు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. డీఆర్పీ సాగర్ మాట్లాడుతూ, పాల ఉత్పత్తులు, మసాలా పొడులు, తినుబండారాలు, ఆహార పానీయాల తయారీలో నాణ్యత ప్రమాణాలు, పరిశుభ్రత, ప్యాకింగ్, బ్రాండింగ్, ఆధునిక యంత్రాల వినియోగంపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. యూనిట్ స్థాపన నుంచి ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, సబ్సిడీ పొందే వరకు ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అండగా నిలుస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీసీలు సురేష్, నరసయ్య, శ్రీలత, నాగరాజ్, జయంతికతో పాటు వివిధ గ్రామాల మహిళా లబ్ధిదారులు పాల్గొన్నారు.

# బిఎల్‌ఎ లకు సిర్ శిక్షణ – డా. విష్ణు రెడ్డికి సన్మానం

హనుమకొండ, జూలై 2 హైదరాబాద్ ఎస్టేట్:
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సిర్) ప్రక్రియను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేసి, తప్పులులేని ఓటర్ల జాబితా రూపకల్పనలో బూత్ లెవెల్ ఏజెంట్లు (బిఎల్‌ఎ లు) కీలక బాధ్యత నిర్వహించాలని టీపీసీసీ జనరల్ సెక్రటరీ, 8వ డివిజన్ ఇంచార్జ్ బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండ డీసీసీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన 8వ డివిజన్ బిఎల్‌ఎ ల సమావేశంలో ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డా. నాయిని గోధా విష్ణు రెడ్డి బిఎల్‌ఎ లకు ప్రత్యేక శిక్షణ నిర్వహించి, ఇంటింటి సర్వే, కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం6, పేర్ల తొలగింపులకు ఫారం7, ఓటరు వివరాల సవరణకు ఫారం8లను క్షేత్రస్థాయిలో నిబంధనలకు అనుగుణంగా ఎలా పూర్తి చేయాలో సవివరంగా వివరించారు. అర్హులైన ప్రతి ఓటరిని ఓటర్ల జాబితాలో నమోదు చేయడం, అనర్హుల వివరాలను



నిబంధనల మేరకు సవరించడం, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించడం ద్వారా సిర్ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, సంస్థాగత వ్యవస్థను పటిష్ఠం చేయడం, ప్రజలతో నిరంతర అనుసంధానం కొనసాగించడం, వంద శాతం ఖచ్చితమైన ఓటర్ల జాబితా సిద్ధం చేయడంపై చర్చించారు. అనంతరం



డాక్టర్స్ డే సందర్భంగా వైద్య రంగంలో అందిస్తున్న సేవలను గుర్తిస్తూ డా. నాయిని గోధా విష్ణు రెడ్డిని బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మనోహర్, డివిజన్ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ శ్రీమాన్, శ్రీనివాస్, సతీష్, లక్ష్మణ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రి పాలకమండలిని రద్దు చేయాలి

## మాదిగలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ కొత్త కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ఎమ్మార్పీఎస్ డిమాండ్

వరంగల్, జులై 2 హైదరాబాద్ ఎస్టేట్:
యాదాద్రి దేవస్థానం పాలకమండలిని వెంటనే రద్దు చేసి, మాదిగలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ కొత్త కమిటీని ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు నమిండ్ల క్లెమెంట్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దళిత రత్న కేదాసి మోహన్ ఆదేశాల మేరకు నమిండ్ల క్లెమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాదాద్రి దేవస్థానం పాలకమండలిలో తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు ప్రాతినిధ్యం కల్పించకపోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఉద్యమాలకు అండగా నిలిచిన వర్గాలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులకు కూడా పాలకమండలిలో అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. యాదాద్రి వంటి ప్రతిష్ఠాత్మక దేవస్థానం పాలకమండలిలో అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం దక్కేలా ప్రస్తుత కమిటీని రద్దు చేసి, మాదిగలు, ఉద్యమకారులు, స్థానిక



ఎమ్మెల్యేలకు తగిన ప్రాతినిధ్యం కల్పించే కొత్త పాలకమండలిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు చింత జోసెఫ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇల్లందుల సురేష్, గీసుగొండ మండల అధ్యక్షుడు బరిగెల యాకూబ్, అధికార ప్రతినిధి నల్ల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు కాపాడుకోవాలి ఉప సర్పంచ్ నాగరాజు

## యాచారం మండలం ధర్మన్నగూడ గ్రామంలో ఉప సర్పంచ్ నాగరాజు

హైదరాబాద్ ఎస్టేట్ యాచారం ప్రతినిధి రామాచారి జులై 2
రంగారెడ్డి జిల్లాయాచారం మండలం కేంద్రాలలో నీధర్మన్నగూడ గ్రామంలోఉపసర్పంచ్ నాగరాజు మాట్లాడుతూ ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ సార్ కార్యక్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు ఈ సందర్భంగానాల్గవవార్డ్ మెంబర్ స్వాతి మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి ఒక్కరికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని అన్నారు అర్హులైన ఓటర్ల పేరు జాబితా నుంచి తొలగిపోకుండా అధికారులు వ్యవహరించాలని రాజకీయ పక్షపాతం లేకుండా సవరణ ప్రక్రియను నిర్వహించాలని కోరారు ప్రతి గ్రామంలో వాడు బూతు స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి వారి పేర్లు ఓటర్ జాబితాలో ఉన్నాయో లేదో తప్పనిసరి గా పరిశీలించాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు ప్రజాస్వామ్యంలో బలోపేతానికి ప్రతి అరుహుడి ఓటు కీలకమని అందరూ తమ ఓటు హక్కును పరిశీలించుకోవాలని బిజెపి పార్టీ యాచారం మండలం



ధర్మన్నగూడ గ్రామం ఉప సర్పంచ్ నాగరాజు నాలుగో వార్డ్ సభ్యురాలు స్వాతి రవీందర్ సతయ్య శ్రీను వాస్ నాగేష్ చారి గౌర శీను అంగన్వాడీ టీచర్ శోభ కోరారు

# వరంగల్‌కు విశాల పండ్ల మార్కెట్ నిర్మించాలి

## 2030 ఎకరాల్లో ఆధునిక మార్కెట్ ఏర్పాటు

## చేయాలని రైతు, ప్రజాసంఘాల డిమాండ్



వరంగల్, జులై 2 హైదరాబాద్ ఎస్టేట్:
రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరమైన వరంగల్‌కు రైతులు, వ్యాపారుల అవసరాలకు అనుగుణంగా 20 నుంచి 30 ఎకరాల విస్తీర్ణంలో అన్ని ఆధునిక సౌకర్యాలతో నూతన పండ్ల మార్కెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిర్మించాలని రైతు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రస్తుతం నిర్మిస్తున్న మార్కెట్ భవిష్యత్ అవసరాలకు ఏమాత్రం సరిపోదని, సమగ్ర మార్కెట్ ఏర్పాటే రైతులకు శాశ్వత పరిష్కారమని స్పష్టం చేశారు. వరంగల్ నగరంలోని అబ్బనికుంట తెలంగాణ రైతు భవన్‌లో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన రైతు, ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఈ మేరకు తీర్మానాలు చేశారు. వక్తలు మాట్లాడుతూ.. నాలుగేళ్ల క్రితం లక్ష్మీపురం పండ్ల మార్కెట్‌ను కూల్చివేసినప్పటి నుంచి పండ్ల రైతులు తమ దిగుబడిని విక్రయించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వ్యాపారులు నగరంలోని పలు ప్రాంతాల్లో అద్దె దుకాణాల్లో వ్యాపారం నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికే రూ.9 కోట్లు వెచ్చించినప్పటికీ మార్కెట్ నిర్మాణం పూర్తికాకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న నాలుగు ఎకరాల మార్కెట్ రిటైల్ విక్రయాలకు మాత్రమే పరిమితమవుతుందని, ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే పండ్ల వ్యాపారం, భారీ వాహనాల రాకపోకలు, నిల్వ, వేలం నిర్వహణకు అది ఏమాత్రం సరిపోదని అభిప్రాయపడ్డారు. నగర శివారులో 20 నుంచి 30 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం సమకూర్చి, భారీ వాహనాల పార్కింగ్, లోడింగ్‌అన్‌లోడింగ్ యార్డులు, వేలం కేంద్రాలు, గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజ్ తదితర ఆధునిక సౌకర్యాలతో సమగ్ర పండ్ల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశానికి కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ కొంగ వీరస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఐకేఎంఎస్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క మొగిలి, ఏఐకేఎస్‌ఎస్ జిల్లా కన్వీనర్ వల్లందాస్ కుమార్, ఏఐకేఎస్ జిల్లా కన్వీనర్ సుధమల్ల భాస్కర్, ఓదెల రాజయ్యతో పాటు పలు రైతు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణ కోసం సోమిడి శ్రీనివాస్‌ను కన్వీనర్‌గా నియమిస్తూ 11 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. సమావేశంలో వరంగల్ శివారులో విశాల స్థలంలో ఆధునిక పండ్ల మార్కెట్ నిర్మాణం, ప్రభుత్వ భూసేకరణ, రైతులకు కోల్డ్ స్టోరేజ్ సౌకర్యాల కల్పనకు సంబంధించిన మూడు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అరెస్టు అప్రజాస్వామికం

## గురుకులాల అక్రమాలపై ప్రశ్నించే గొంతును అణిచివేయొద్దు

## : స్వేరో స్టూడెంట్స్ యూనియన్





హనుమకొండ, జూలై 2 హైదరాబాద్ ఎస్టేట్:
మాజీ గురుకులాల కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను అరెస్టు చేయడాన్ని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ (ఎస్ఎస్‌యూ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ తీవ్రంగా ఖండించారు. గురుకులాల్లో రూ.2,000 కోట్ల అవినీతి జరిగిందంటూ ఆధారాలతో బహిరంగ చర్చకు సిద్ధమైన సమయంలో ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకోవడం అప్రజాస్వామిక చర్య అని విమర్శించారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. గురుకులాల కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసిన అనుభవంతో ప్రస్తుతం గురుకుల విద్యాసంస్థల్లో జరుగుతున్న అవకతవకలపై డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ప్రజలకు వాస్తవాలను వివరించే అవకాశాన్ని అడ్డుకునే చర్యలను స్వేరో స్టూడెంట్స్ యూనియన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. గురుకులాల్లో జరిగిన అవినీతిపై పారదర్శక విచారణ జరిపి నిజానిజాలను ప్రజలకు వెల్లడించాలని, ప్రశ్నించే వారిని నిర్బంధించడం కాకుండా ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు తెలంగాణ ప్రజల మద్దతు ఉంటుందని సాయికుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు చెట్టుపల్లి శివకుమార్, కాకతీయ ప్రభుత్వ కళాశాల అధ్యక్షుడు రాజ్‌కుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యక్షుడు అభిలాష్, నాయకులు శ్రావణ్, శ్రీనాథ్, ప్రణీత్, పండు, శ్రీకాంత్, దేవరాజ్, కిరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ పాలిటెక్నిక్‌లో 59 సీట్లు ఖాళీ

## మెకానికల్‌లో 35 సీట్లు

## స్పాట్ అడ్మిషన్లు రేపటితో ముగింపు






వరంగల్, జూలై 2 హైదరాబాద్ ఎస్టేట్:
ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వరంగల్‌లో 202627 విద్యా సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుండగా మొత్తం 59 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్సిపాల్ పి. శ్రీనివాస్ తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు జూలై 3తో గడువు ముగియనుంది. కోర్సుల వారీగా చూస్తే మెకానికల్ ఇంజనీరింగ్‌లో 35 సీట్లు ఖాళీగా ఉండగా, సివిల్ ఇంజనీరింగ్‌లో 1 సీటు, సివిల్ (రియల్ ఎస్టేట్ & వాల్యుయేషన్)లో 21 సీట్లు, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో 2 సీట్లు ఉన్నాయని తెలిపారు. స్పాట్ అడ్మిషన్లు జూలై 4న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక సెట్ జిరాక్స్ కాపీలతో వ్యక్తిగతంగా కళాశాలకు హాజరుకావాలని సూచించారు. ఫీజుల వివరాల ప్రకారం సంస్థ ఫీజు రూ.5,080గా నిర్ణయించగా, టీజీ పాలీసెట్ అర్హత ఉన్న అభ్యర్థులకు ఎస్సీ/ఎస్టీ రూ.300, ఓసీ/బీసీ/ఈడబ్ల్యూఎస్ రూ.600 చెల్లించాల్సి ఉంటుంది. పాలీసెట్ అర్హత లేనివారికి ఎస్సీ/ఎస్టీ రూ.550, ఓసీ/బీసీ/ఈడబ్ల్యూఎస్ రూ.1,100గా ఫీజు నిర్ణయించారు.

హైదరాబాద్ ఎస్టేట్
03 శుక్రవారం జూలై 2026.

# సిర్ పై కాంగ్రెస్ సదస్సు

## ఓటరు జాబితా పరిశీలనలో కార్యకర్తలే కీలకం

## కొండా మురళీధర్ రావు



వరంగల్ తూర్పు, జూలై 02 హైదరాబాద్ ఎస్టేట్: ఎన్నికల సంఘం చేపట్టిన సిర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిషన్) ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అవగాహన సదస్సు నిర్వహించింది. సిటీ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు, పార్లమెంట్ ఇంచార్జ్ అహ్మద్ నసీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా మురళీధర్ రావు మాట్లాడుతూ బూత్ లెవెల్ అధికారులు (బి ఎల్ వోలు) ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ప్రతి బూత్ లెవెల్ ఏజెంట్, పార్టీ కార్యకర్తలు సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను నిర్ధారించాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో తప్పకుండా నమోదు కావాలని, ఎక్కడా పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచే ఓటు హక్కు పరిరక్షణ బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల్ నవీన్ రాజ్, వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ సిర్ ఇంచార్జులు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో భావోద్వేగ వీడ్కోలు

### సన్ ప్రీత్ సింగ్‌కు ఘన సత్కారం

### వాహనాన్ని తాళ్లతో లాగి పోలీసుల వినూత్న గౌరవం





వరంగల్, జూలై 02 హైదరాబాద్ ఎస్టేట్: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో 15 నెలలపాటు సేవలందించి ఇటీవల సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా బదిలీ అయిన ఐపీఎస్ అధికారి సన్ ప్రీత్ సింగ్‌కు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘన వీడ్కోలు లభించింది. గురువారం ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన కార్యక్రమం భావోద్వేగ వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై సన్ ప్రీత్ సింగ్‌ను నిలబెట్టి, పోలీస్ అధికారులు తాళ్లతో వాహనాన్ని లాగుతూ తమ అభిమానాన్ని, గౌరవాన్ని వినూత్న రీతిలో చాటారు. ఈ అరుదైన దృశ్యం అక్కడున్న ప్రతి ఒక్కరినీ కదిలించింది. అనంతరం మాట్లాడిన సన్ ప్రీత్ సింగ్, వరంగల్ పోలీస్ కమిషనరేట్ అధికారులను ఎప్పటికీ గుండెల్లో నిలుపుకుంటానని అన్నారు. కమిషనరేట్‌లో ప్రతి అధికారి, సిబ్బంది సహకారం మరువలేనిదని, సమన్వయంతో పనిచేయడం వల్ల శాంతిభద్రతల నిర్వహణలో మంచి ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. వరంగల్‌తో తనకు ఏర్పడిన అనుబంధం జీవితాంతం గుర్తుండిప

# కుడా భూముల వేలం రగడ

## బహిరంగ చర్చకు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి సవాల్



హన్మకొండ, 02 హైదరాబాద్ ఎస్టేట్: కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ) భూముల వేలం వ్యవహారం రాజకీయ రగడకు దారితీసింది. వేలంపై బీఆర్ఎస్ నేతలు చేసిన ఆరోపణలకు కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఘాటుగా స్పందించారు. వేలం పూర్తిగా పారదర్శకంగా, నిబంధనల ప్రకారమే జరిగిందని ఆయన స్పష్టం చేశారు. అవినీతి ఆరోపణలు నిరాధారమని తేల్చిచెప్పిన ఆయన, ఆధారాలుంటే దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేయాలని, లేకపోతే ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని హెచ్చరించారు. భద్రకాళి అమ్మవారి ఆలయంలో ప్రమాణం చేయాలన్న సవాల్‌పై స్పందిస్తూ, "ఏ గుడికైనా వచ్చి ప్రమాణం చేయడానికి సిద్ధం" అని ప్రకటించారు. ఆరోపణలు చేసిన దాస్యం వినయ్ భాస్కర్‌ను వెంటబెట్టుకుని బహిరంగ చర్చకు రావాలని ఆయన ప్రతిసవాల్ విసిరారు. ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని స్పష్టం చేసిన వెంకట్రామ్ రెడ్డి, గత పాలనలో కుడా నిధుల వినియోగంపై విచారణ ఇప్పటికే ప్రారంభమైందని తెలిపారు. పాత ఆర్థిక లావాదేవీలన్నీ త్వరలో వెలుగులోకి వస్తాయని వ్యాఖ్యానించారు. కుడా ఆస్తులను కాపాడుతూ ప్రభుత్వ ఆదాయం పెరిగేలా వేలం నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. రాజకీయ ఆరోపణలతో వాస్తవాలను మార్చలేరని, నిజాలు తప్పకుండా బయటకు వస్తాయని బీఆర్ఎస్ నేతలకు హితవు పలికారు.

# ప్రశ్నించే గొంతులను అణచివేయొద్దు..

## ప్రభుత్వ తీరుపై కప్పాటి పాండురంగారెడ్డి విమర్శలు



( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 02:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం కేంద్రంలో కప్పటి పాండురంగారెడ్డి మాట్లాడుతూ...ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి అణచివేత రాజకీయాలకు పాల్పడుతోందని, ప్రశ్నించే గొంతులను నొక్కేయాలని చూడటం అత్యంత దుర్మార్గమని టీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, ఉద్యమ నాయకుడు కప్పాటి పాండురంగారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులను, పార్టీ నాయకులను అర్ధరాత్రి వేళల్లో ముందస్తుగా, అక్రమంగా గృహ నిర్బంధాలు మరియు అరెస్టులు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గురువారం ఫ్యూచర్ సిటీ పోలీస్ కమీషనరెట్ కందుకూరు పి.ఎస్ పరిదిలోని బాచుపల్లిలోని తమ నివాసగృహం లో పాండురంగా రెడ్డిని తెల్లవారుజామున అక్రమ అరెస్టును నిరసిస్తూ విలేఖరులకు అందజేసిన పత్రికా ప్రకటనలో పాండురంగారెడ్డి మాట్లాడుతూ
ప్రజాస్వామ్య హక్కులను హరిస్తూ సాగుతున్న ఈ నిర్బంధ పాలనపై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.
ఈ సందర్భంగా కప్పాటి పాండురంగారెడ్డి మాట్లాడుతూ... "తెలంగాణ సిద్ధాంతం కోసం, స్వరాష్ట్రం కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడిన ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా వంచిస్తోంది. ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, ఇప్పుడు 'ఉద్యమకారుల గుర్తింపు కమిటీ' పేరుతో కాలయాపన చేయడం సరికాదు. ఉద్యమకారులకు ఇస్తామన్న ఇంటి స్థలాలు, ఇతర హామీలు మరియు హక్కుల సాధన కోసం ప్రజాస్వామ్య బద్ధంగా, శాంతియుతంగా ఆందోళనలు, నిరసనలు చేస్తుంటే.. సహించలేక ఖాకీలను ప్రయోగించి అక్రమ అరెస్టులు చేయించడం ఈ ప్రభుత్వ నిరంకుశత్వానికి అద్దం పడుతోంది."ఎన్నికల నాడు ఓట్ల కోసం ఇచ్చిన మాటను నిలబెట్టుకోమంటే.. ఎక్కడికక్కడ అక్రమ అరెస్టులు చేయడమేనా ప్రజా పాలనా విధానం?
ప్రజా సమస్యలపై, ఉద్యమకారుల ఆవేదనపై గళమెత్తితే సంకెళ్లు వేసి భయభ్రాంతులకు గురిచేస్తారా? ఇచ్చిన హామీలను పూర్తిగా తుంగలో తొక్కి, హక్కుల కోసం పోరాడే వారిపై అక్రమ కేసులు బనాయించడం ప్రజాస్వామ్య వ్యతిరేకం.ప్రభుత్వం ఇప్పటికైనా అణచివేత ధోరణిని వీడి, తక్షణమే కాలయాపన చేయకుండా ఉద్యమకారులందరికీ ఇచ్చిన ఇండ్ల స్థలాల హామీని, ఇతర వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని కప్పాటి పాండురంగారెడ్డి డిమాండ్ చేశారు. అక్రమంగా అరెస్ట్ చేసిన నాయకులను, ఉద్యమకారులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసారు.

## కేరళపురంలో "సత్వం ఊటుపుర" ప్రారంభం..ఆయుర్వేద మిల్లెట్ ఆహారానికి శ్రీకారం

( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూలై 02:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రంలో...కేరళపురంలోని శ్రీ మాధవన్ జీ కేరళ ఆయుర్వేద ప్రాంగణంలో "సత్వం ఊటుపుర"పేరుతో సాత్విక డైట్,మిల్లెట్ ఆహార కేంద్రాన్ని గురువారం పూజ్య శ్రీ మాధవన్ జీ ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి వైద్యులు,శ్రేయోభిలాషులు సహా 200 మందికి పైగా హాజరయ్యారు."శుద్ధత నుంచి ఆరోగ్యం"అనే నినాదంతో ప్రారంభమైన ఈ కేంద్రంలో ఆయుర్వేద సూత్రాలకు అనుగుణంగా చిరుధాన్యాలతో తయారుచేసిన సాత్విక,వైద్యపరమైన ఆహారాన్ని రోగులు,సేవకులు,సందర్శకులకు అందించనున్నారు.సంప్రదాయ కేరళ ఆయుర్వేద విధానంలో ఆహారం తయారు చేయడం ఈ కేంద్రం ప్రత్యేకతగా నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో డా. రామదాస్ స్వాగత ప్రసంగం చేయగా, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ తరుణ్ సభికులను ఆహ్వానించారు.తెలంగాణ ప్రభుత్వ గాంధీ ఆస్పత్రి డైరెక్టర్ జనరల్ డా.శేషాద్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ వరుణ్ వేదికపై పాల్గొన్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.ఓషధి సంస్థ తరఫున శ్రీ శ్రీకాంత్ కార్యక్రమానికి హాజరయ్యారు.సత్వం ఊటుపుర నిర్వహణ బాధ్యతను ఓషధి సంస్థ స్వీకరించగా,ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిథులందరికీ మిల్లెట్ ఆధారిత సాత్విక ఆహారాన్ని సంస్థ తరఫున అందించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ,చిరుధాన్యాలను నిత్య ఆహారంలో భాగంగా ప్రోత్సహిస్తూ,ఆరోగ్యకరమైన జీవనశైలికి అనుగుణంగా స్వచ్ఛమైన,సాత్వికమైన,వైద్యపరమైన





భోజనాన్ని అందించడమే సత్వం ఊటుపుర ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# సోనీ భాయ్‌కు ఘన నివాళి

## కాజీపేటలో సంతాప సభలో భావోద్వేగాలు

కాజీపేట, జులై 2 హైదరాబాద్ ఎస్టేట్: ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మహ్మద్ యాకుబ్ ఏ సోనీ (అకాల మరణం) పట్ల గురువారం పోచమ్మగుడి కమ్యూనిటీ హాల్, బాపూజీనగర్‌లో సంతాప సభ నిర్వహించారు. రాజకీయ నాయకులు, అనుచరులు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులు అర్పించారు. సోనీ భాయ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి కుటుంబ సభ్యులను నేతలు ఓదార్చారు. ఈ సందర్భంగా మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ భావోద్వేగానికి లోనయ్యారు. "40 ఏళ్ల అనుబంధం ఉన్న సోనీ భాయ్ లేరనే విషయం అంగీకరించలేకపోతున్నాను. ఆయన నాకు కుటుంబ సభ్యుడిలా ఉండేవారు" అని అన్నారు. ప్రజాసేవలో ఎప్పుడూ ముందుండే వ్యక్తిగా సోనీ భాయ్ గుర్తుండిపోతారని, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని ఆయన తెలిపారు. "నలుగురికి



మంచి చేయాలనే తపనే ఆయన జీవితం" అని పేర్కొన్నారు. సోనీ భాయ్ స్మారకార్థం మదర్సా చిన్నారులకు సాయం అందిస్తానని ప్రకటించారు. ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ మాట్లాడుతూ సోనీ భాయ్ ఉద్యమకారుడు, విలువలతో కూడిన నాయకుడని కొనియాడారు. పార్టీలకు అతీతంగా సంతాప సభ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. మైనార్టీ నాయకుడు




అబ్దుల్ సోహెల్ మాట్లాడుతూ సోనీ భాయ్ పూర్తిగా ప్రజాసేవకే అంకితమయ్యారని పేర్కొన్నారు. పదవులు ఆశించకుండా పనిచేసిన నాయకుడిగా ఆయన గుర్తుండిపోతారని తెలిపారు. సోనీ భాయ్‌కు నిజమైన నివాళి ప్రజాసేవ కొనసాగించడమేనని నేతలు పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## ఎన్టీఆర్ భరోసా పించన్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లను అందజేసిన

### – రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ





మండలం లో కొండుపాలెం, ధర్జినగర్, మామిడిపాలెం, పాపయ్యపాలెం, గ్రామాలలో పేదలకు సేవలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణి కార్యక్రమంలో వారు పాల్గొని గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఏ పి యుఎఫ్ డి ఐ సి పీలా గోవింద సత్యనారాయణ పింఛన్లు పంపిణి చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల జీవితాలలో ఆర్థిక భరోసా కల్పించేందుకే ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ , టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ కేంద్రంలోని నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్రంలో అనేక సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారు అని అన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల శ్రేణులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
03 శుక్రవారం జూలై 2026.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్త విద్యార్థి ఉద్యమం తప్పదు

## ప్రభుత్వ విద్యా విధానం పేద, బీసీ విద్యార్థులకు అనుకూలంగా లేదని గుజ్జ సత్యం విమర్శ

## పాలమూరు యూనివర్సిటీలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిరాహార దీక్ష అధ్యాపకులు, విద్యార్థి సంఘాలు, సామాజిక సంస్థల సంఘీభావం

మహబూబ్‌నగర్, జూలై 02:
తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమం ఉధృతం అవుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం హెచ్చరించారు. పాలమూరు యూనివర్సిటీలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన లి"ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధన దీక్ష"లిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి యూనివర్సిటీకి చెందిన పలువురు ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, సామాజిక సంస్థల నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా గుజ్జ సత్యం మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత విద్యను సామాజిక న్యాయ సాధనంగా తీర్చిదిద్దుతామని ఇచ్చిన హామీలు ఆచరణలో బలహీనపడుతున్నాయనే ఆందోళన వ్యక్తం చేశారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం కారణంగా వేలాది మంది విద్యార్థులు కాలేజీల్లో అవమానాలు ఎదుర్కొంటున్నారని, పరీక్షలకు అనుమతించకపోవడం, సర్టిఫికెట్లు నిలిపివేయడం, చదువు మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యా విధానంపై స్పందిస్తూ, విధానాల కంటే వాటి అమలే ముఖ్యమని పేర్కొన్నారు. విద్యా సంస్కరణల పేరుతో తీసుకొచ్చే ప్రతి నిర్ణయం పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల చదువుకు భరోసా కల్పించాలే తప్ప, వారి ఆర్థిక భారం పెంచేలా ఉండకూడదన్నారు. "విద్యార్థికి అందుబాటులో లేని విధానం ఎంత ఆకర్షణీయంగా కనిపించినా అది ప్రజా విధానం కాదు" అని వ్యాఖ్యానించారు.

ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నప్పటికీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడం ఆ ప్రకటనలకు విరుద్ధమని విమర్శించారు. విద్యార్థులకు చెల్లించాల్సిన నిధులు సమయానికి విడుదల కాకపోతే, ఉన్నత విద్య పేద కుటుంబాలకు అందని ద్రాక్షగా మారే ప్రమాదం ఉందన్నారు.

రాష్ట్రంలోని అనేక ప్రైవేట్, ప్రొఫెషనల్ కళాశాలలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, దాని ప్రభావం నేరుగా విద్యార్థులపై పడుతోందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వ్యవస్థను బలోపేతం చేయకుండా విద్యా రంగంలో నాణ్యత గురించి మాట్లాడటం అసంపూర్ణమని అన్నారు.

"ప్రభుత్వాలు మారొచ్చు విధానాలు మారొచ్చు కానీ పేద విద్యార్థి చదివే హక్కు మారకూడదు. విద్యపై పెట్టుబడి ఖర్చు కాదు అది రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టుబడి" అని గుజ్జ సత్యం స్పష్టం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు, భవిష్యత్తులో ఆలస్యం జరగకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల పోరాటానికి అందరూ అండగా నిలవాలి: తాయప్ప

పాలమూరు యూనివర్సిటీ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు తాయప్ప మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ నిరాహార దీక్ష ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా కాదని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు చేపట్టిన ప్రజాస్వామ్య ఉద్యమమని పేర్కొన్నారు.




అధ్యాపకులు, విద్యార్థి సంఘాల సంఘీభావం

కార్యక్రమంలో పాల్గొన్న పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, విద్యా అవకాశాలు ఆర్థిక స్థోమతపై ఆధారపడే పరిస్థితి ఏర్పడకూడదని అభిప్రాయపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం సామాజిక న్యాయానికి కీలకమైన సాధనమని, ప్రభుత్వం దీనిపై అత్యవసరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రధాన డిమాండ్లు

- పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.
- ఫీజుల కారణంగా విద్యార్థులను పరీక్షలకు అనుమతించకుండా ఉండే చర్యలను నిలిపివేయాలి.
- సర్టిఫికెట్లు నిలిపివేయడంపై కఠిన ఆదేశాలు జారీ చేయాలి.
- కొత్త విద్యా విధానంపై విద్యార్థి సంఘాలు, అధ్యాపకులు, నిపుణులతో విస్తృత చర్చ నిర్వహించాలి.
- పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల ఉన్నత విద్యకు పూర్తి రక్షణ కల్పించే విధానాలను అమలు చేయాలి.

పలువురు ప్రముఖుల పాల్గొనడం

ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షురాలు మట్ట జయంతి గౌడ్, నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్, పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ కుమారస్వామి, నాన్-టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామ్మోహన్, జీబీసీ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నగర్, మాజీ డీఈఓ విజయ్ కుమార్, సారంగి లక్ష్మీకాంత్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్, స్వేరో రాష్ట్ర అధ్యక్షుడు పవన్, లంబాడి హక్కుల సమితి అధ్యక్షుడు సాయి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు నరేందర్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శివాజీ, వివిధ బీసీ విద్యార్థి సంఘాల నాయకులు, పరిశోధక విద్యార్థులు, ప్రొఫెసర్లు, సామాజిక సంస్థల ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు.
వక్తలందరూ ఏకగ్రీవంగా మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్‌లను ఆలస్యం చేయడం వల్ల పేద, బీసీ విద్యార్థుల ఉన్నత విద్య ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే పెండింగ్ నిధులను విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కళాశాలలను కలుపుకొని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యపై పెట్టుబడి పెట్టడం రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టుబడి అని, పేద విద్యార్థి చదువుకు రక్షణ కల్పించడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని స్పష్టం చేశారు.

# హుస్సేన్ సాగర్ చుట్టూ యదేచ్ఛగా అద్దెల దందా

## హెచ్ఎండిఏ కు మొండి చెయ్యి

హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి
విష్ణువర్ధన్
హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఉన్న హుస్సేన్‌సాగర్ చుట్టూ లీజులు, అద్దెల దందా యథేచ్ఛగా సాగుతోంది. గతంలో రాజకీయ పలుకుబడి, పైరవీలతో దుకాణాలు దక్కించుకున్న వారు ప్రస్తుతం అద్దెలు, లీజులు చెల్లించకుండా ముఖం చాటేస్తున్నారు. అధికారులు అడిగితే గిరాకీ లేదంటూ బుకాయిస్తున్నారు. ప్రస్తుతం కొన్ని దుకాణాలకు సంబంధించి లీజుల గడువు ఇప్పటికే ముగిసినా, కొత్త టెండర్లు ఆహ్వానించకుండా వారినే కొనసాగించడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో పర్యాటకం జోరందుకుంది. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన నూతన సచివాలయం(రావఎతీమ్మితీఅఫ్), అమరుల స్థూపంతో హుస్సేన్‌సాగర్ చుట్టూ మరింత పర్యాటకశోభ సంతరించుకుంది. వారాంతాల్లో వీటిని చూడటానికి వచ్చే పర్యాటకులతో ట్యాంక్‌బండ్ వద్ద రద్దీ గణనీయంగా పెరిగింది. వీరి రాకతో వీధి వ్యాపారులకు గిరాకీ బాగా పెరిగింది.
ఇంత గిరాకీ ఉన్నప్పటికీ దుకాణాదారులు లీజులు, అద్దెలు చెల్లించడం లేదు. గతంలో రాజకీయ పలుకుబడి, పైరవీలతో దుకాణాలు దక్కించుకున్న వారు ప్రస్తుతం అద్దెలు, లీజులు చెల్లించకుండా ముఖం చాటేస్తున్నారు. అధికారులు అడిగితే గిరాకీ లేదంటూ బుకాయిస్తున్నారు. ప్రస్తుతం కొన్ని దుకాణాలకు సంబంధించి లీజుల గడువు ఇప్పటికే ముగిసినా, కొత్త టెండర్లు ఆహ్వానించకుండా వారినే కొనసాగించడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
ఈ క్రమంలో హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) అద్దెలు, లీజులు చెల్లింపులో ఆలస్యంతో పాటు ఎగవేతకు పాల్పడుతున్న 35 సంస్థలకు తాఖీదులు జారీ చేసింది. వెంటనే బకాయిలు చెల్లించకపోతే అనుమతులు రద్దు చేస్తామని నోటీసులు పంపించింది. అయినప్పటికీ పలు సంస్థల నుంచి స్పందన లేకపోవడంతో లీజు రద్దు దిశగా హెచ్ఎండీఏ అడుగులు వేస్తోంది.
హుస్సేన్‌సాగర్ పరిధిలోని నెక్లెస్‌రోడ్డు, పీపుల్స్‌ప్లాజా, బుద్ధపూర్ణిమ, ట్యాంక్‌బండ్, జలవిహార్, ఐమాక్స్, ఎన్టీఆర్ గార్డెన్, పీవీఘాట్, సంజీవపార్కు తదితర ప్రాంతాల్లో పర్యాటకుల రద్దీ అధికంగా ఉంటుంది. వారాంతాలైన శని, ఆదివారాలు, ఇతర సెలవు రోజుల్లో భారీగా సందర్శకులు వస్తుంటారు. ఈ ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర వ్యాపార దుకాణాలు 80 వరకు ఉన్నాయి. వీటి నిర్వహణకు హెచ్ఎండీఏ టెండర్ల ద్వారా ఏడాది నుంచి మూడేళ్ల టైం పీరియడ్‌తో లీజుకు అనుమతులు ఇస్తుంది. మరికొన్నింటిని నెలవారీ అద్దె ప్రాతిపదికన కొనసాగిస్తుంటారు. ఏటా సదరు దుకాణాల నుంచి లీజులు, అద్దెల ద్వారా రూ.17 కోట్లపైనే




హెచ్ఎండీఏకు ఆదాయం వస్తోంది. అయితే గత కొంతకాలంగా లీజుల చెల్లింపులలో తీవ్ర జాప్యం నెలకొంది. ఇక్కడున్న కొందరు వ్యాపారులు కొన్ని నెలలపాటు అద్దెలు చెల్లించడం లేదు. ఇంకొందరు వ్యక్తులు నాలుగైదు వ్యాపారాలు నిర్వహిస్తూ ఒకదానికి చెల్లించి మిగతా వాటికి మొండి చెయ్యి చూపుతున్నారు. కొన్ని సంస్థలు లీజుల గడువు ముగిసి రెండు, మూడేళ్లు అవుతున్నా ఏదో కారణంతో లీజు పొడిగిస్తూ నెట్టుకొస్తున్నారు. ఒకవైపు అసలు వ్యాపారమే లేదంటున్న వారు.. లీజుల గడువు ఎందుకు పెంచుకుంటున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది.

-న్యూస్ డెస్క్
హైద్రాబాద్ ఎస్టేట్


# ప్రతిభకు గుర్తింపు

## ట్రాన్స్‌కో వరంగల్ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శిగా పుల్యాల రాజిరెడ్డి




వరంగల్, జూలై 2 హైదరాబాద్ ఎస్టేట్:
ట్రాన్స్‌కో వరంగల్ సర్కిల్ స్పోర్ట్స్ కౌన్సిల్ నూతన కార్యవర్గంలో ఏడీఈ పుల్యాల రాజిరెడ్డి ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. క్రీడల అభివృద్ధి, ఉద్యోగుల్లో క్రీడాస్ఫూర్తి పెంపే లక్ష్యంగా ఏర్పాటైన ఈ కార్యవర్గానికి సూపరింటెండెంట్ ఇంజనీర్ బి. రవీంద్ర అధ్యక్షుడిగా, డీఈ చంద్రప్రకాశ్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అసిస్టెంట్ జనరల్ సెక్రటరీగా శ్యాంప్రసాద్, జాయింట్ సెక్రటరీగా విజయ్, అవుట్‌డోర్ స్పోర్ట్స్ సెక్రటరీగా సుమన్, ఇండోర్ గేమ్స్ సెక్రటరీగా కందికొండ వెంకటేష్, మహిళా ప్రతినిధిగా పల్లె సృజన, కల్చరల్ సెక్రటరీగా శ్రీనివాస్ రెడ్డి ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా దాసరి జయచందర్, బాలాజీ నాయక్, మురళి, టి.వి. రమేష్ బాధ్యతలు చేపట్టారు. నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో సర్కిల్‌లో క్రీడా కార్యకలాపాలను మరింత విస్తృతం చేసి, ఉద్యోగుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించే దిశగా పనిచేస్తామని సభ్యులు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పుల్యాల రాజిరెడ్డికి అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో స్పోర్ట్స్ కౌన్సిల్ మరింత చురుకుగా పనిచేస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఎస్సైని లంచ్ టైం వరకు నిలబెట్టిన హైకోర్టు!




పోలీస్ అయినంత మాత్రాన చట్టాన్ని ఉల్లంఘిస్తావా అంటూ మధురానగర్ ఎస్సైపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రిటైర్డ్ ఎస్సై అయిన పిటిషనర్ ఉస్మాన్(75)ను లోదుస్తుల్లో ఉండగా ఇంటి నుంచి ఈడ్చుకెళ్లడంపై మండిపడింది. మధ్యాహ్న భోజన సమయం వరకు కోర్టులోనే నిలబడాలని ఎస్సైని ఆదేశించింది. పోలీస్ కమిషనర్ నుంచి నివేదిక తెప్పించుకుని అందజేయాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 15కు వాయిదా వేసింది. మే 18న యూసఫ్‌గూడలోని తన ఇంటిలో ఉండగా పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్లారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ రిటైర్డ్ ఎస్సై ఉస్మాన్ పిటిషన్ దాఖలు చేయగా.. జస్టిస్ టీ.మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది..

# సోమలింగపాలెంలో విశాఖ డైరీ నూతన పాలకవర్గం ఏకగ్రీవం

## కాపు, గవర సామాజిక వర్గాల నుంచి ముగ్గురికి ఐదేళ్ల పాటు చైర్మన్ బాధ్యతలు

ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని సోమలింగపాలెం గ్రామంలో విశాఖ డైరీ నూతన పాలకవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
గ్రామ పెద్దలు కర్రి శివ, కర్రి ఝాన్సీ, యల్లపు గోపి, వేగి ఆదినారాయణ, కర్రీ వరబాబు, యల్లపు పరమేశ్వరరావు, కర్రీ విశ్వేశ్వరరావు, ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఐదేళ్ల కాలానికి ముగ్గురు సభ్యులను రొటేషన్ పద్ధతిలో చైర్మన్ లుగా వ్యవహరించేలా గ్రామ పెద్దలు నిర్ణయించారు.

వివరాలు:
- 2026 నుండి 2027 వరకు: బొద్దపు రమణ - కాపు సామాజిక వర్గం
- 2027 నుండి 2029 వరకు: కర్రి సత్యనారాయణ - గవర సామాజిక వర్గం
- 2029 నుండి 2031 వరకు: కర్రి పరమేశ్వరరావు - గవర సామాజిక వర్గం

సామాజిక సమతుల్యత పాటిస్తూ కాపు, గవర సామాజిక వర్గాల నుంచి ముగ్గురికి అవకాశం కల్పించామని కర్రి శివ తెలిపారు. విశాఖ డైరీ ద్వారా



పాల ఉత్పత్తిదారులకు గిట్టుబాటు ధర, బోనస్ అందేలా నూతన పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, పాల సేకరణ కేంద్ర సభ్యులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in

03 శుక్రవారం జూలై 2026.

## గంజాయి అక్రమ రవాణా దారునిపై పోలీసుల ఉక్కుపాదం

### వరుస నేరస్థుడిపై 'పిట్ ఎన్.డి.పి.ఎస్ చట్టం ప్రయోగం



ఎంజిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, అనకాపల్లి జిల్లాలో గంజాయి అక్రమ రవాణా మరియు విక్రయాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగా, వరుస గంజాయి నేరాలకు పాల్పడుతున్న ఒక నిందితుడిపై అత్యంత కఠినమైన పిట్ ఎన్ డి పి ఎస్ చట్టం కింద ఉత్తర్వులు జారీ చేసి, సెంట్రల్ జైలుకు తరలించారు.నిందితుడి పోతురాజు ఇతనిపై గతంలో రోలుగుంట పోలీస్ స్టేషన్‌లో మూడు వేర్వేరు గంజాయి కేసులు నమోదై ఉన్నాయి. నిత్యం అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ, సమాజానికి ముప్పుగా మారిన ఇతని ప్రవర్తనపై పోలీసులు నిఘా ఉంచారు. ప్రభుత్వం గంజాయిపై తీసుకుంటున్న కఠిన చర్యల్లో భాగంగా, రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ గారి ఉత్తర్వుల మేరకు నిందితుడిపై ఈ ప్రత్యేక చట్టాన్ని ప్రయోగించారు.?కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు, జిల్లా ఎన్.డి.పి.ఎస్ సెల్ సిఐ పిల్లా రమేష్ మరియు రోలుగుంట ఎస్సై రామకృష్ణారావుల ఆధ్వర్యంలో పోలీసులు ఈ ఆపరేషన్ నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నిందితుడిని అరెస్ట్ చేసి, పటిష్ట భద్రత నడుమ విశాఖపట్నం సెంట్రల్ జైలుకు రిమాండ్ నిమిత్తం తరలించారు.జిల్లాలో గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా లేదా విక్రయించినా ఎంతటి వారైనా సహించేది లేదు. అలవాటు పడిన పాత నేరస్తులపై కేవలం సాధారణ సెక్షన్లే కాకుండా, 'పిట్ ఎన్.డి.పి.ఎస్' వంటి కఠినమైన చట్టాలను ప్రయోగిస్తాం. అవసరమైతే నేరస్తుల ఆస్తులను కూడా జప్తు చేయడానికి వెనకాడబోం అని ఎస్పీ తెలిపారు.

## సేవ త్యాగం గుణాలుగా కలిగిన వైద్య వృత్తి

### బి ఎస్ పి నేత సూదికొండ మాణిక్యాలరావు



సమాజంలో సేవ త్యాగం వంటి మంచి గుణాలు కలిగిన వృత్తి వైద్య వృత్తి అని వైద్యులు ప్రజలకు ప్రాణదాతలు అని బహుజన సమాజ్ పార్టీ అనకాపల్లి జిల్లా ఇన్చార్జ్ సూదికొండ మాణిక్యాలరావు అన్నారు జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఈరోజు ఆయన అనకాపల్లి పట్టణంలోని స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం సూపరిడెంట్ డాక్టర్ రవి మరియు అనకాపల్లి పట్టణంలో ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ జనపరెడ్డి శ్రీనివాసరావును మరియు మరొక ప్రముఖ వైద్యులు డి డి నాయుడు లను కలిసి వారిని సత్కరించారు అనంతరం మాణిక్యాలరావు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో వైద్యం వ్యాపారమయంగా మారిపోయిందని అన్నారు మెరుగైన వైద్యం ప్రజలకు సామాన్య ప్రజలకు అందనంత ఎత్తులో ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు

అయితే వైద్యులు మాత్రం తమ సహజ గుణమైన సేవ త్యాగం వంటి వాటితో ప్రజల్లో నిలిచిపోతున్నారని అన్నారు సమాజంలో ఉన్నతమైన విద్య వ్యక్తిత్వం కలిగిన వైద్యులు కూడా తమ వంతుగా సమాజంలో నిరుపేద మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా సమాజంలో వైద్యులు అందరికీ అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో చనిపోయిన కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇవ్వాలి

### జ్యుడీషియల్ ఎంక్వైరీ చెయ్యాలి. భద్రతా చర్యలు చేపట్టాలి

### జులై 3 న నిరసన ను విజయవంతం చెయ్యండి

### కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు




విశాఖ స్టీల్ ప్లాంట్ ఎస్ఎంఎస్-1 లో జూన్ 8 న హాట్ మెటల్ తీసుకువెళ్తున్న లేడర్ ప్రమాదంలో 10 మంది కార్మికులు మరణించడం, ఆరుగురు తీవ్ర గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదాలకు పూర్తి బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలే కారణం. నాసిరకమైన ముడి సరుకును వాడడం, యంత్రాలను మరమ్మత్తుల చేయకపోవడం, అనుభవం ఉన్న సిబ్బందిని తొలగించడం, కార్మికులపై విపరీతంగా పని భారం మోపడం వెరసి ఈ ప్రమాదానికి కారణమైంది. చనిపోయిన మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలి. క్షతగాత్రులకు 50 లక్షల రూపాయలు చెల్లించాలి. ఘటన పై న్యాయ విచారణ జరిపి దోషులను శిక్షించాలి. భద్రతా ప్రమాణాలు పాటించాలి. ఈరోజు సిఐటియు కార్యాలయంలో జరిగిన పత్రిక విలేకరుల సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, ఏఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు వైఎన్భద్రంలో మాట్లాడారు. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సిఐటియు ఎఐటియుసి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యలు తక్షణమే ఆపాలని, ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలని, కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా ఈ నెల మూడో తేదీన అనకాపల్లి నెహ్రూ చౌక్ జంక్షన్లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ను జయప్రదం చేయాలని పిలుపు ఇచ్చారు. ఈ పత్రిక విలేకరులు సమావేశంలో సిఐటియు అనకాపల్లి జిల్లా కన్వీనర్ కాళ్ల తాళయ్య బాబు, ఏఐటీయుసీ నాయకులు కోరిబిల్లి శంకర్రావు, ముత్తుర్తి సూరిబాబు, పప్పల ఈశ్వరరావు పాల్గొన్నారు

# కొమ్మాలలో ధ్వజస్తంభ మహోత్సవ శోభ

### వైభవంగా ప్రారంభమైన వైదిక క్రతువులు

### నాలుగు రోజులపాటు భక్తి వాతావరణం





గీసుకొండ, జూలై 02 హైదరాబాద్ ఎస్టేట్:
కొమ్మాల శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జూలై 2 నుంచి 5 వరకు కొనసాగనున్న ఈ వైదిక క్రతువులతో ఆలయ ప్రాంగణం భక్తి శోభతో నిండిపోయింది. రూ.14 లక్షల వ్యయంతో గుంటూరు ప్రాంతం నుంచి తీసుకొచ్చిన 60 ఏళ్ల నారాయప చెట్టుతో రూపొందించిన 42 అడుగుల ధ్వజస్తంభ ప్రతిష్ఠ కోసం పాంచరాత్ర ఆగమ విధానంలో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. తొలి రోజు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణం వంటి క్రతువులు వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ అర్చకులు, ధర్మకర్తలు, వేదపండితులు పాల్గొనగా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. ఈ మహోత్సవాన్ని కీ.శే. వేములపల్లి సంపత్‌కుమార్ స్మారకార్థంగా వారి కుటుంబ సభ్యులు దాతలుగా నిర్వహిస్తున్నారు. ప్రధాన ఘట్టమైన ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ఠ, స్థాపన కార్యక్రమం జూలై 5న ఉదయం 7.05 గంటలకు శతభిషా నక్షత్రంకర్కాటక లగ్న సుముహూర్తంలో జీయర్ స్వామి అమృతహస్తాలతో నిర్వహించనున్నారు. అనంతరం మహాపూర్ణాహుతి, శాంతి కళ్యాణం, అన్నప్రసాద సంతర్పణ కార్యక్రమాలు జరుగుతాయి. మహోత్సవాల విజయవంత నిర్వహణకు ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి అనుగ్రహం పొందాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేములపల్లి సంతోష్, కోనె వెంకటగిరి, సాయిలి ప్రభాకర్, వీరాటి లింగారెడ్డి, అంకత్ నాగేశ్వరరావు, ప్రధాన పూజారి రామాచార్యులు, పూజారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనం నెపంతో చిన్నారిని చిత్రహింసలకు గురిచేసిన పాస్టర్ జయరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలి

### బాధిత బాలికకు ప్రభుత్వం పూర్తి రక్షణ, విద్య, సంరక్షణ కల్పించాలి

### డా. పిట్టా వరప్రసాద్, రాష్ట్ర అధ్యక్షులు & జాతీయ కార్యదర్శి, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్ )



విజయవాడ, జూలై 2:
అల్లూరి సీతారామరాజు జిల్లా, జి.కె.వీధి మండలం, దారకొండ గ్రామపంచాయతీ పరిధిలోని ఏనుగుబయలు గ్రామంలో జరిగిన అమానుష ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు మరియు జాతీయ కార్యదర్శి డా. పిట్టా వరప్రసాద్ పేర్కొన్నారు.
తల్లిదండ్రులు లేని ఎనిమిదేళ్ల బాలిక పాస్టర్ జయరాజ్ ఇంట్లో పనిచేస్తున్న సమయంలో, ఇంట్లో బంగారం దొంగతనం జరిగిందనే ఆరోపణతో ఆమెను తీవ్రంగా కొట్టి గాయపరచడమే కాకుండా, వేడిచేసిన అట్లకాడతో కాల్చి చిత్రహింసలకు గురిచేసిన ఘటన అత్యంత క్రూరమైనదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐతో ఫోన్‌లో మాట్లాడి సంఘటన వివరాలను తెలుసుకున్నట్లు తెలిపారు.

తల్లిదండ్రులు లేని కారణంగా బంధువుల వద్ద ఆశ్రయం పొందుతున్న చిన్నారిని పేదరికం వల్ల పాస్టర్ ఇంట్లో పనికి పంపారని, అలాంటి నిస్సహాయ బాలికపై అమానుషంగా ప్రవర్తించడం మానవత్వానికే మచ్చ అని అన్నారు.ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిందితుడు పాస్టర్ జయరాజుపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మరియు పోలీసు అధికారులను డా. పిట్టా వరప్రసాద్ డిమాండ్ చేశారు.అదేవిధంగా బాధిత బాలికకు తక్షణ వైద్య చికిత్స, మానసిక పరామర్శ, రక్షణ కల్పించడంతో పాటు, ఐసీడీఎస్ మరియు సంబంధిత శిశు సంక్షేమ శాఖ అధికారుల ద్వారా ఆమెకు శాశ్వత సంరక్షణ, విద్య, పోషణ ఏర్పాట్లు చేయాలని కోరారు.చిన్నారులపై హింసను ఏ పరిస్థితుల్లోనూ సహించబోమని, నేరస్థులు ఎంతటి హోదాలో ఉన్నా చట్టం ముందు బాధ్యత వహించాల్సిందేనని డా. పిట్టా వరప్రసాద్ స్పష్టం చేశారు.

# ఉపాధి హామీని విచ్ఛిన్నం చేయొద్దు....

### కొత్త చట్టం రద్దుచేసి, పాత చట్టాన్ని కొనసాగించాలి....

### ఉపాధి హామీ కార్మిక సంఘం సిఐటియు గౌరవ అధ్యక్షులు గని శెట్టి డిమాండ్.






పేదల ఉపాధి హామీకి ముప్పుగా మారిన కొత్త చట్టం వి బి గ్రామ్ జి జూలై 1 నుండి అమలు చేయొద్దని, పాత చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రావాడ గ్రామంలోపని ప్రదేశంలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధి హామీ కార్మిక సంఘం సిఐటియు మండల గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి, దాని స్థానంలో మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన వి బి గ్రామ్ జి లోని నిబంధనలు ఉన్న ఉపాధిని దూరం చేసేలా ఉందని గని శెట్టి విమర్శించారు. కొత్త చట్టం అమలకి 55 క్లాజులు, వందల సబ్ పాయింట్లు విడుదల చేస్తున్న డ్రాఫ్ట్ రూల్స్ అత్యంత ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఈ రూల్స్ అమలు చేస్తే పని హామీ ఉండదని అధికారాలు లేకుండా రాష్ట్రాలు చివరికి ఉత్సవ విగ్రహాల వలె మిగిలిపోతాయని గని శెట్టి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కేంద్ర ప్రభుత్వం వద్ద భిక్షాటన చేయవలసిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త చట్టం కింద కేంద్రం బడ్జెట్లో ఆంధ్ర రాష్ట్రానికి రూ 7, 707 కోట్లు, రాష్ట్రం 40% వాటా రూ 5, 138 కోట్లు కలిపి మొత్తం 12, 845 కోట్లు ఏడాది అందుబాటులో ఉంటాయని అన్నారు. ఈ మొత్తం వేతనాలకి ఇస్తే కేవలం జాబ్ కార్డు ఉన్న కార్మికులకు ఒక్కొక్కరికి78 పని దినాలు మాత్రమే కార్మికులకి రాష్ట్రంలో వస్తాయి అన్నారు. కేంద్ర ప్రభుత్వం చెప్పినట్లుగా 125 పని దినాలు కల్పించాలంటే 22, 746 కోట్లు కావాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అదనంగా ఒక్క రూపాయి కూడా ఇవ్వదని అంటే రాష్ట్ర ప్రభుత్వమే తన వాటా కాకుండా రూ 9, 901 కోట్లు అదనంగా ఖర్చు చేయవలసి వస్తుందని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం ఉపాధి పై ఎంత కక్షపూరితంగా వ్యవహరిస్తుందో గత ఆరు నెలల్లో ఉపాధి అనుభవం చెప్తుంది అని అన్నారు. జులై 1 నుండి చట్టాన్ని అమలు చేస్తే ఇంకా పని దినాలు ఎలా కుదిస్తారో స్పష్టమవుతుందని అన్నారు. ఈ కొత్త చట్టం రద్దుచేసి పాత చట్టాన్ని పునరుద్ధించే వరకు ఉపాధి హామీ కార్మికులు పోరాడాలని గని శెట్టి పిలుపునిచ్చారు. అనంతరం సమస్యతో కూడిన వినతి పత్రాన్ని మండలంలో ఉపాధి హామీ కార్మికుల నాయకులు ఎంపీడీవో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ కి అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉపాధి కార్మికులు సుధా, జి శ్రీను, పి పార్వతి, పైడితల్లి, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పేద వర్గాలకు వరం – మాదంశెట్టి నీలబాబు



ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పథకంలో ఎక్కడా లేని విధంగా ప్రతినెల 1వ తేదీన క్రమం తప్పకుండా లబ్ధిదారులు ఇంటి ముందుకు ప్రభుత్వ ప్రతినిధులను పంపి లబ్ధిదారులకు పెన్షన్ అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రజా సంక్షేమాన్ని ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా అమలు చేస్తున్న ఏకైక పథకం ఎన్టీఆర్ భరోసా పథకమేనని 84 వ వార్డులో తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మాదంశెట్టి నీలబాబు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి నాలుగు వేల రూపాయలు అందించి వారి కళ్ళల్లో ఆనందాన్ని చూసానని నీలబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు తలారి ప్రసాదు పార్టీ నాయకులు పిల్లా తారకేశ్వరరావు కాండ్రేగుల జగదీశ్వరరావు జనసేన నాయకులు మడగల శ్రీనివాసరావు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in



# రజినీకాంత్ 'జైలర్ 2' రిలీజ్ డేట్ ఫిక్స్...

## మరోసారి బాక్సాఫీసును షేక్ చేసేందుకు తలైవా రెడీ!

సూపర్‌స్టార్ రజినీకాంత్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'జైలర్ 2' సినిమా విడుదల తేదీ ఖరారైంది. ఈ చిత్రాన్ని ఈ ఏడాది అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ గురువారం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెడుతూ, కొత్త రిలీజ్ డేట్ టీజర్‌ను కూడా విడుదల చేసింది.ఈ టీజర్‌లో విలన్ పాత్రధారి వినాయకన్.. "నన్ను చంపి ప్రశాంతంగా ఉండలేవు. నా వెనుక పెద్ద ప్రపంచం ఉంది జైలర్! ఇది చాలా పెద్ద నెట్‌వర్క్. ఎవరు, ఎప్పుడు, ఎలా వస్తారో కూడా నీకు తెలియదు. నీ జీవితం నరకంగా మారుతుంది" అని హెచ్చరించడం ఉత్కంఠ రేపుతోంది. ఆ తర్వాత రజినీకాంత్ స్టైలిష్‌గా ఎంట్రీ ఇవ్వడం అభిమానులను ఆకట్టుకుంటోంది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.గతేడాది విడుదలై బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన 'జైలర్' చిత్రానికి ఇది సీక్వెల్ కావడం విశేషం. తొలి భాగం ప్రపంచవ్యాప్తంగా రూ. 650 కోట్లకు పైగా వసూళ్లు సాధించి ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. దీంతో రెండో భాగంపై అంచనాలు రెట్టింపయ్యాయి. ఈ చిత్రంలో మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, తమిళ నటుడు విజయ్ సేతుపతి కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు.

రమ్యకృష్ణ, మిర్నా మీనన్ ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు.

ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయినట్లు ఏప్రిల్‌లోనే చిత్రబృందం ప్రకటించింది. తొలి భాగానికి తన సంగీతంతో ప్రాణం పోసిన అనిరుధ్ రవిచందర్ ఈ సీక్వెల్‌కు కూడా స్వరాలు సమకూరుస్తున్నారు.



## డాక్టర్లు ఇంకెప్పుడూ పాడలేవన్నారు... కానీ ఏఆర్ రెహమాన్ సంగీతంలో పాడి చూపించింది!


ఒకప్పుడు 'ఇండియన్ ఐడల్' వేదికపై తన గాత్రంతో ఆకట్టుకున్న గాయని దీపాలీ సహాయ్, తీవ్రమైన గొంతు సమస్యల కారణంగా భవిష్యత్తులో మళ్ళీ పాడలేరని వైద్యులు తేల్చిచెప్పినప్పటికీ, అకుంఠిత దీక్షతో తిరిగి పుంజుకున్నారు. తాజాగా ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీత సారథ్యంలో ఆమె ఆలపించిన గీతం సంగీత ప్రియులను విశేషంగా అలరిస్తోంది. ఇంతియాజ్ అలీ దర్శకత్వం వహించిన 'మై వాపస్ ఆవూంగా' చిత్రంలోని 'తేరే పాస్ మై' పాట ప్రస్తుతం సోషల్ మీడియాలో విశేష ఆదరణ పొందుతోంది.సుమారు 19 ఏళ్ల క్రితం 'ఇండియన్ ఐడల్ సీజన్ 3'లో అగ్రశ్రేణి కంటెస్టెంట్‌గా నిలిచిన దీపాలి, ఆ తర్వాత నాలుగో సీజన్‌కు వ్యాఖ్యాతగా కూడా వ్యవహరించారు. ఆ సమయంలో అధిక శ్రమ కారణంగా ఆమె స్వరపేటికకు గాయమై రక్తస్రావం జరగడంతో, మాట్లాడటం కూడా కష్టతరంగా మారింది. ఆమె గాయనిగా ఇక కొనసాగలేరని వైద్యులు స్పష్టం చేయడంతో, సంగీతానికి విరామం



ఇచ్చి నటన వైపు దృష్టి సారించారు. పలు టీవీ ధారావాహికలలో నటిస్తూనే, పుణేలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్‌లో దర్శకత్వ శాఖలో శిక్షణ పొందారు.కొన్నేళ్ల విరామం అనంతరం ప్రముఖ గీత రచయిత బాబా అజ్మీ ప్రోత్సాహంతో ఆమె తిరిగి సాధన ప్రారంభించారు. తన గాత్రంలోని వైవిధ్యాన్ని చాటుతూ కవర్ సాంగ్స్, జానపద గీతాలను యూట్యూబ్ వేదికగా పంచుకోవడం మొదలుపెట్టారు. ఆమె నిరంతర కృషి ఫలితంగా, ఆ గాత్రం ఏఆర్ రెహమాన్ బృందం దృష్టిని ఆకర్షించింది. విశేషమేమిటంటే, రెహమాన్ జన్మదినమైన జనవరి 6వ తేదీనే దీపాలి పుట్టినరోజు కూడా కావడం. సరిగ్గా అదే రోజున ఆమెను చెన్నైకి ఆహ్వానించి ఈ పాటను రికార్డ్ చేయడం విశేషం.మూడు వారాల క్రితం విడుదలైన ఈ గీతానికి ప్రస్తుతం అద్భుతమైన స్పందన లభిస్తోంది. సోనూ నిగమ్, విశాల్ మిశ్రా వంటి ప్రముఖ గాయకులు సైతం ఆమె ప్రతిభను అభినందించారు. కెరీర్ ముగిసిపోయిందనుకున్న క్లిష్ట దశ నుంచి కోలుకుని, రెహమాన్ వంటి దిగ్గజంతో పనిచేయడం దైవికమైన అనుభూతిగా దీపాలి అభివర్ణించారు. అచంచలమైన పట్టుదల, నిరంతర సాధన ఉంటే ఏదైనా సాధించవచ్చని దీపాలి సహాయ్ జీవన ప్రయాణం నిరూపిస్తోంది.

## 'లాకప్ 2'లో రామ్ కపూర్‌కు కంగనా స్ట్రాంగ్ వార్నింగ్!

ప్రముఖ రియాలిటీ షో 'లాకప్: సచ్ యా సజా' సీజన్ 2లో బాలీవుడ్ నటి కంగనా రనౌత్ సందడి చేశారు. 'జనతా కీ ఆవాజ్' ప్రతినిధిగా ఈ షోకు వచ్చిన ఆమె, కంటెస్టెంట్‌గా ఉన్న సీనియర్ నటుడు రామ్ కపూర్ వైఖరిని తప్పుపట్టారు. వ్యక్తిత్వంలో మెరుగుదల కోరుకునే వారు తమను తాము సమర్థించుకోవడం మానుకోవాలని ఆమె హితవు పలికారు.నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారమవుతున్న ఈ షోకు ఫరా ఖాన్, రితేశ్ దేశ్‌ముఖ్ హోస్ట్‌లుగా వ్యవహరిస్తున్నారు. షో ఐదో ఎపిసోడ్‌లో కంటెస్టెంట్ల ప్రవర్తనను సమీక్షించేందుకు కంగనా రనౌత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె నేరుగా రామ్ కపూర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ.. "మీరు ఈ ఆటను అస్సలు సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఈ జైలు వాతావరణం మీకు సరిపడదని భావిస్తే, అసలు ఇక్కడికి ఎందుకు వచ్చారు?" అని నిలదీశారు. దీనికి రామ్ కపూర్ తనను తాను సమర్థించుకునే ప్రయత్నం చేయగా.. "మీలో మార్పు రావాలని మీరు నిజంగా కోరుకుంటే, ముందుగా మిమ్మల్ని మీరు సమర్థించుకోవడం ఆపండి" అని కంగనా స్పష్టం చేశారు.ఇదే ఎపిసోడ్‌లో అంతకుముందు హోస్ట్ ఫరా ఖాన్ కూడా రామ్ కపూర్‌కు చురకలంటించారు. సాధారణంగా వివిధ ప్రాజెక్టులలో కథానాయకుడిగా కనిపించే రామ్, ఈ షోలో మాత్రం వెనుకబడిపోతున్నారని ఆమె వ్యాఖ్యానించారు. దీనిపై రామ్ కపూర్ తీవ్రంగా స్పందిస్తూ.. "అయితే నన్ను పంపించేయండి.. నేను మారను, నా ప్రవర్తన ఇలాగే ఉంటుంది" అని పేర్కొన్నారు. దీనిపై ఫరా ఖాన్ వ్యంగ్యంగా స్పందిస్తూ.. "పరిస్థితులకు అనుగుణంగా మారని వారు డైనోసార్లలా కనుమరుగైపోతారు" అని వ్యాఖ్యానించారు.మొదటి సీజన్‌కు హోస్ట్‌గా వ్యవహరించిన కంగనా, ఈసారి అతిథిగా వచ్చి కంటెస్టెంట్ల ప్రవర్తనపై స్పందించడం ఆసక్తికరంగా మారింది. ఈ ఎపిసోడ్ ప్రసారమైన తర్వాత సోషల్ మీడియాలో దీనిపై విస్తృతంగా చర్చ జరుగుతోంది.




## వివాహ బంధంలోకి బోనీ కపూర్ కుమార్తె..
## ఈ నెల 6న బాయ్ ఫ్రెండ్ తో అన్షులా పెళ్లి



బాలీవుడ్ ప్రముఖ నిర్మాత బోనీ కపూర్ కుమార్తె అన్షులా కపూర్ వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టనున్నారు. ఆమె తన ప్రియుడు, స్క్రీన్‌రైటర్ రోహన్ థక్కర్‌ను పెళ్లాడబోతున్నారు. వీరి వివాహం జులై 6న జరగనున్నట్లు బోనీ కపూర్ స్వయంగా ధృవీకరించారు. రెండు కుటుంబాల సంప్రదాయాలను మిళితం చేస్తూ, అత్యంత సన్నిహితుల మధ్య ఈ వేడుకను ఒక్క రోజులోనే పూర్తి చేయనున్నారు.ఈ పెళ్లి వేడుకలు జూన్ 21న 'మాతా కీ చౌకీ'తో ఘనంగా ప్రారంభమయ్యాయి. వరుడి కుటుంబం నిర్వహించిన ఈ కార్యక్రమానికి కపూర్ కుటుంబ సభ్యులంతా హాజరయ్యారు. అర్జున్ కపూర్, జాన్వీ కపూర్, ఖుషీ కపూర్‌తో పాటు కుటుంబ సభ్యులంతా సంప్రదాయ దుస్తుల్లో మెరిశారు. ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలను అన్షులా, అర్జున్ సోషల్ మీడియాలో పంచుకున్నారు.అన్షులా, రోహన్ ఒక డేటింగ్ యాప్ ద్వారా పరిచయమయ్యారు. గతేడాది జులైలో న్యూయార్క్‌లోని సెంట్రల్ పార్క్‌లో రోహన్ ఆమెకు ప్రపోజ్ చేశారు. ఆ తర్వాత 2025 అక్టోబర్‌లో ముంబైలో వీరి నిశ్చితార్థం కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య జరిగింది.వివాహం అనంతరం సినీ పరిశ్రమకు చెందిన స్నేహితుల కోసం ప్రత్యేకంగా ఒక కాక్‌టెయిల్ పార్టీని ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే అతిథులు 'మోడరన్ ఇండియన్' డ్రెస్ కోడ్ పాటించాలని నిర్వాహకులు కోరారు.

## అంచనాలు పెంచేసిన నోలన్ 'ది ఒడిస్సీ'..
## కౌంట్‌డౌన్ ట్రైలర్ వచ్చేసింది!




ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ చిత్రం 'ది ఒడిస్సీ' నుంచి ఫైనల్ ట్రైలర్ విడుదలైంది. యూనివర్సల్ పిక్చర్స్ రిలీజ్ చేసిన ఈ 'కౌంట్‌డౌన్ ట్రైలర్' సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. గ్రీక్ పురాణాల ఆధారంగా ఈ సినిమా ఒక విజువల్ వండర్‌గా తెరకెక్కుతోంది.ట్రోజన్ యుద్ధం ముగిశాక ఇథాకా రాజు 'ఒడిస్సియస్' తన రాజ్యానికి, భార్య వద్దకు తిరిగి రావడానికి పదేళ్లపాటు చేసిన ప్రమాదకర ప్రయాణమే ఈ సినిమా కథ. తాజాగా విడుదలైన ట్రైలర్‌లో సముద్రపు తుపానులు, భయంకరమైన రాక్షసులతో పోరాటాలు, యుద్ధ సన్నివేశాలను గ్రాండ్‌గా చూపించారు. నోలన్ మార్క్ విజువల్స్ ప్రేక్షకులను కట్టిపడేస్తున్నాయి.ఈ చిత్రంలో ఒడిస్సియస్ పాత్రలో ప్రముఖ నటుడు మాట్ డామన్ నటించగా, అతని భార్య పెనెలోప్ పాత్రలో అన్నే హాత్వే కనిపించనుంది. వీరితో పాటు టామ్ హాలండ్, రాబర్ట్ ప్యాటిన్సన్, జెండయా, షార్లిజ్ థెరాన్ వంటి భారీ తారాగణం ఈ సినిమాలో భాగమైంది. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం ఈ నెల 17న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

## బ్రేక్‌అప్‌లపై జెన్నిఫర్ లోపేజ్ ఆసక్తికర వ్యాఖ్యలు



ప్రముఖ హాలీవుడ్ నటి, గాయని జెన్నిఫర్ లోపెజ్ తన విఫల ప్రేమ సంబంధాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బ్రేక్-అప్‌లను వైఫల్యాలుగా పరిగణించకూడదని, వాటిని వ్యక్తిగత ఎదుగుదలకు లభించిన అవకాశాలుగా చూడాలని ఆమె పేర్కొన్నారు. ఇటీవల కరీమ్ రహ్మా హోస్ట్ చేసిన 'సబ్వే టేక్స్' అనే ఇంటర్నెట్ టాక్ షోలో ఆమె ఈ అభిప్రాయాలను పంచుకున్నారు.న్యూయార్క్ సబ్వేలో జరిగిన ఈ ఇంటర్వ్యూలో 56 ఏళ్ల లోపెజ్ మాట్లాడుతూ, "బ్రేక్ అప్‌లు వైఫల్యాలు కావు. నిజానికి మనల్ని మనం మరింత మెరుగ్గా తీర్చిదిద్దుకోవడానికి అవొక లాంచ్‌ప్యాడ్ వంటివి. ఎవరైనా విడిపోయినప్పుడు విచారించకుండా మనం పార్టీ చేసుకోవాలి. 'మీరు విడిపోయారా? కంగ్రాట్స్' అని చెప్పాలి. ఎందుకంటే, అది ఆ ఇద్దరి శ్రేయస్సు కోసం తీసుకున్న సరైన నిర్ణయం కావచ్చు" అని వివరించారు.తన జీవితంలో ఎదురైన మానసిక సవాళ్ల నుంచే తాను అత్యధికంగా నేర్చుకున్నానని జెన్నీఫర్ లోపెజ్ తెలిపారు. "నా జీవితంలో మానసికంగా, వైయుక్తికంగా నేను ఎదిగింది కేవలం హృదయం ముక్కలైన సందర్భాల్లోనే. అది ప్రేమ వైఫల్యం కావచ్చు లేదా వృత్తిపరమైన నిరాశ కావచ్చు. అటువంటి క్లిష్ట సమయాల్లోనే 'అసలేం జరిగింది? మన ప్రవర్తన ఎలా ఉంది? ముమ్ముందు ఏం చేస్తే బాగుంటుంది?' అని మన గురించి మనం ఆత్మపరిశీలన చేసుకుంటాం. మనల్ని మనం మార్చుకోవడానికి ప్రయత్నిస్తాం" అని ఆమె పేర్కొన్నారు.హాలీవుడ్ నటుడు బెన్ అఫ్లెక్‌ను 2022లో వివాహం చేసుకున్న జెన్నీఫర్ లోపెజ్, 2025లో ఆయన నుంచి విడాకులు తీసుకున్నారు. ఇది ఆమెకు నాలుగో విడాకులు. ఈ నేపథ్యంలో సంబంధ బాంధవ్యాలపై ఆమె చేసిన ఈ తాజా వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.







